'దారి' చూపండి..

- ఏళ్లుగా నడుస్తున్న రోడ్డు కబ్జా
- పాలకవర్గం, అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- దారిలేక ఇబ్బంది పడుతున్న ప్రజలు
- సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్న కుటుంబాలు


కాలువ నిర్మాణానికి ముందు (ఫైల్)


కాలువ వరకు నిర్మించిన గోడ

జమ్మికుంట: ఏళ్లుగా నడుస్తున్న దారిని కబ్జా చేసి ప్రహరీ నిర్మించారు. దారిలేక ఇక్కట్లు పడుతున్నామని అధికారులు, మున్సిపల్ పాలకవర్గం సభ్యులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సినవారు నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తున్నారని కాలనీలో నివాసం ఉండే కుటుంబాల వారు ఆరోపిస్తున్నారు. సమస్య పరిష్కరించి నడిచేందుకు దారి చూపాలని వేడుకుంటున్నారు.

అసంపూర్తిగా కాలువ నిర్మాణం

పట్టణంలోని అంబేద్కర్ కాలనీ, హనుమడ్లపల్లి కాలనీలోని 8, 10 వార్డులకు చెందిన యాభై కుటుంబాల్లోనివారు ఏళ్లుగా ఆ దారిలో నడిచేవారు. రైల్వే గేటు నుంచి వచ్చే వరదకాలువ దారి పక్క నుంచి పోయేది. రైల్వే గేటు నుంచి వచ్చే వరదకోసం, మురుగునీరు వెళ్లేందుకు మోరీ నిర్మించాలని ప్రధాన డిమాండ్ కొనసాగుతుండేది. 2015లో మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్ కాలువ నిర్మాణం చేపట్టేందుకు శిలాఫలకం వేశారు. కానీ పనులు చేపట్టకపోవడంతో సమస్య అలాగే కొనసాగుతూ వచ్చింది. ఈక్రమంలో హుజూరాబాద్ ఉపఎన్నికల సందర్భంగా ప్రజలు కాలువ, రోడ్డు నిర్మాణం కోసం డిమాండ్ చేశారు. అధికారులు, నాయకులు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాలువ నిర్మాణం అసంపూర్తిగా చేశారు. కాలువ పక్కన రోడ్డు వేస్తామన్నా హామీని వదిలేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోజులు గడుస్తున్న సమయంలో కాలువ పక్కన స్థలం ఉన్న ఓ యాజమాని వరదకాలువ వరకు ప్రహరీ నిర్మించాడు. దీంతో నడిచేందుకు దారి లేకుండా పోవడంతో ఆయా కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు సొంత ఇళ్లను ఖాళీ చేసి అద్దె ఇళ్లలోకి మారారు. ప్రహరీ నిర్మాణ సమయంలో పలుమార్లు ఉన్నతాధికారులు, పాలకవర్గం, స్థానిక వార్డు కౌన్సిలర్లకు ఫిర్యాదు చేసినా సమస్యను పట్టించుకోలేదని, మామూళ్లు ముట్టడంతోనే విచారణ జరిపి చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు.

పట్టించుకోవడం లేదు



ఎన్నికల సమయంలో వరదకాలువ నిర్మించారు. దాని పక్కన 12 ఫీట్లతో రోడ్డు వేస్తామన్నా హామీని నెరవేర్చాలి. నెలలు గడుస్తున్నా పట్టణ మ్యాప్‌లో దారి ఉన్నట్లు చూయిస్తోంది. స్థల యాజమాని దారి కబ్జా చేశాడని ఫిర్యాదు చేసినా పట్టంచుకోవడం లేదు. అధికారులు విచారణ జరిపి రోడ్డు నిర్మించాలని కోరుతున్నాం.

– ఎగ్గని శ్రీనివాస్, కాలనీవాసి, జమ్మికుంట

ఇబ్బంది పడుతున్నాం



కాలువ నిర్మాణం చేపట్టక ముందు ఏళ్లుగా మురుగుకాలువ పక్కన నుంచి మట్టి దారిలో నడుస్తున్నాం. ఎన్నికల సమయంలో పెద్ద నాయకులు వచ్చారు. మోరీ నిర్మిస్తాం, పక్కన దారి వేస్తామన్నారు. ప్రస్తుతం నడిచేందుకు దారి లేకుండా చేశారు. దారిలేక ఇళ్లకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నాం.

– వేముల హేమలత, కాలనీ వాసి, జమ్మికుంట

అద్దె ఇంట్లో ఉంటున్నాం



సొంత స్థలంలో ఇళ్లు కట్టుకున్నాం. వరదకాలువ పక్క నుంచి ఇంటికి వెళ్లేది. అసంపూర్తిగా కాలువతోపాటు దారి నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రహరీతో ఇంటికి వెళ్లేదుకు దారి లేకుండా పోయింది. మాతో పాటు చాలా మంది ఇళ్లు ఖాళీ చేసి హనుమడ్ల పల్లిలో అద్దె ఇళ్లలో ఉంటున్నారు.

– శ్రావణ్‌కుమార్, కాలనీవాసి, జమ్మికుంట

క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చిగురుమామిడి: మండలంలోని ఓగులాపూర్ గ్రామంలో రెండు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన బీఆర్ఎస్ గ్రామ ప్రచార కార్యదర్శి ఇల్లందుల బ్రహ్మయ్య కుటుంబానికి హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఆర్థిక సాయం ప్రకటించారు. మంగళవారం బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు మామిడి అంజయ్య, జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి బ్రహ్మయ్య కుటుంబ సభ్యులకు రూ.పది వేల నగదు అందించారు. పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. సర్పంచ్ బోయిని శ్రీనివాస్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఎంద్ర నారాయణ, యూత్ అధ్యక్షుడు కవ్వంపల్లి తిరుపతి, వార్డు సభ్యుడు అంజయ్య, నాయకులు ఉల్లి శ్రీనివాస్, బోయిని శంకర్, బద్దం మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి పలువురు ఉన్నారు.

చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఆనంద్

గన్నేరువరం: మండలంలోని పీచుపల్లి గ్రామానికి చెందిన సింగిరెడ్డి మల్లారెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 12 వేల చెక్కు మంజూరైంది. మంగళవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్ కార్యాలయంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు వెంకటేశ్, లబ్ధిదారులకు పార్టీ నాయకుడు జీఎస్ ఆనంద్ అందజేశారు. వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, సర్పంచ్ పీచు చంద్రారెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధ్వంసమైన రోడ్లను పునఃనిర్మించాలి

మానకొండూర్: మండలంలో ధ్వంసమైన తారురోడ్లను పునఃనిర్మించాలని సీపీఎం మానకొండూరు జోన్ కార్యదర్శి సుంకరి సంపత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్త సమావేశంలో మాట్లాడారు. ఆర్అండ్‌బీ అధికారులు మండలంలోని లింక్ రోడ్లన్నీ పరిశీలించాలన్నారు. రోడ్లు అధ్వానంగా మారడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని ఎమ్మెల్యే చొరవ తీసుకొని నిధులు మంజూరుకు కృషి చేయాలన్నారు. లేదంటే ప్రజలందరినీ ఐక్యం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జోన్ కమిటీ సభ్యులు శ్రీరాముల నారాయణ, మాతంగి శంకర్, శాతరాజు భద్రయ్య, చిలుకూరి బాలయ్య, నాయకులు ఇజ్జగిరాజవీరు తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

గన్నేరువరం: అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలల సమయం ఉండటంతో ఆయా పార్టీలు ముందస్తు ప్రచారంలో నిమగ్నమయ్యాయి. గన్నేరువరంపై కాంగ్రెస్ దృష్టి ఆరు నెలలుగా సారించింది. ఇప్పటికే డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ ఇంటింటా ప్రచారం పూర్తి చేశారు. అలాగే యువజన సంఘాల అధ్యక్షుడు, చొక్కారావుపల్లె ఉప సర్పంచ్ అల్లూరి శ్రీనాథ్‌రెడ్డితో పాటు యువకులను ఇటీవల పార్టీలో చేరారు. ప్రజలకు మరింత అందుబాటులో ఉండే విధంగా మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పక్కన పార్టీ కార్యాలయం ఏర్పాటుకు సిద్ధమయ్యారు. బుధవారం పార్టీ కార్యాలయాన్ని కవ్వంపల్లితో పాటు మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నారని పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి మంగళవారం తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

హుజూరాబాద్: రోడ్డు ప్రమాదం నుంచి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి సురక్షితంగా బయటపడినందుకు మంగళవారం హనుమాన్ దేవస్థాన చైర్మన్ బూసారావు బాపురావు ఆధ్వర్యంలో నాయకులు ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రవీందర్, వీరన్న, మురళి, రాజేశం, రాజేందర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కందుగుల గ్రామ శివాలయంలో కౌశిక్ రెడ్డి ఆరోగ్యంగా ఉండాలంటూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక పూజలు, అభిషేకం, అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాసం పద్మ రఘుపతి రెడ్డి, వార్డ్ మెంబర్ మండ విజయ సతీష్, నాయకులు రావుల భరత్ రెడ్డి, కాసర్ల శివారెడ్డి, ఇమ్మడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గంగాధరలో మహిళా సంక్షేమ దినోత్సవం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర: మహిళా సంక్షేమంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గంగాధరలో మంగళవారం నిర్వహించిన మహిళా సంక్షేమ దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మహిళల కోసం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలిచిందన్నారు. గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు అందిస్తున్నామని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పురుడు పోసుకున్న వారికి అమ్మఒడి, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం, షీ టీమ్స్‌తో మహిళలకు భద్రత కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఆసరా పింఛన్లతో వృద్ధులు, వితంతువులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ మహిళలకు ప్రాధాన్యత ఇస్తుందని, గృహహింస బాధితులకు సఖీ కేంద్రాలు, పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధికి నైపుణ్య శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పోలీస్‌శాఖ, మార్కెట్ కమిటీ నియమాకాల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించామని వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో అంగన్వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న వంచ భాగ్యరాణి మంగళవారం గంగాధరలో నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ఉత్తమ ఉద్యోగిగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అనంతరం భాగ్యరాణిని గ్రామస్తులు అభినందించారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా..?


మాట్లాడుతున్న బామండ్ల రాజు

గన్నేరువరం: మండల అభివృద్ధిపై బీఆర్ఎస్ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా అని దళిమా మోర్చా మండల అధ్యక్షుడు బామండ్ల రాజు, యువ మోర్చా కార్యదర్శి బోయిని అభిషేక్ ప్రశ్నించారు. మంగళవారం మండలకేంద్రంలో దళిత మోర్చా ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ వైఫల్యాలు, హామీలను ప్రజలకు తెలియజేయడానికి ఫ్లెక్సీని ఏర్పాటు చేశామన్నారు. ప్రశ్నించే వారిపై దాడుల చేసే సంస్కృతిని బీఆర్ఎస్ పెంచి పోషిస్తోందని విమర్శించారు. దళితబంధుతో మోసం చేస్తున్నారని పథకంలో ఎంతమందికి లబ్ధి జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. గుండ్లపల్లి నుంచి గన్నేరువరం వరకు డబుల్ రోడ్డుకు నిధులు వచ్చాయంటూ సంబరాలు చేసుకున్నారు కానీ ఇంతవరకు పనులు ప్రారంభించకపోవడం సిగ్గుచేటన్నారు. తొలగించిన ఫ్లెక్సీ వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బెదిరింపులకు భయపడమని, హామీలను అమలు చేసేత వరకు ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామని హెచ్చరించారు. సమావేశంలో బోయిని హరీశ్, బోయిని మధు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలో జెండా ఆవిష్కరణ



జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు జాతీయ జెండా ఆవిష్కరించారు. రాష్ట్ర ఏర్పాటుతో కేసీఆర్ ప్రభుత్వం విద్యా విధానంలో సమూల మార్పులను తీసుకువచ్చిందన్నారు. విద్యార్థులు అంకితభావంతో చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంపత్, కౌన్సిలర్లు సారంగం, నరేష్, ప్రిన్సిపాల్ కుమారస్వామితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం బ్రిడ్జిపై మంగళవారం రాత్రి బైక్‌ను కారు ఢీకొనడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మక్త గ్రామానికి చెందిన నెలవేని శ్రీకాంత్ మరో వ్యకితో కలిసి ద్విచక్ర వాహనంపై కేశవపట్నం నుంచి స్వగ్రామం వెళ్తుండగా హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారు టైర్ పగిలి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీకాంత్‌కు తీవ్రగాయాలు 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గర్శకుర్తిని మండల కేంద్రంగా ప్రకటించాలి


వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ కొద్ది రోజులుగా దీక్ష చేస్తున్న గ్రామస్తులు మంగళవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గర్శకుర్తిని మండలంగా ప్రకటిస్తామని సీఎం కేసీఆర్ గతంలో ఎంపీగా పోటీ చేసినప్పుడు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. మండలంగా ఏర్పాటు చేస్తే చుట్టు పక్కల గ్రామాలకు అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు.

కౌశిక్‌రెడ్డిని పరామర్శించిన బోయినపల్లి వినోద్‌కుమార్


పరామర్శిస్తున్న వినోద్‌కుమార్

హుజూరాబాద్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని మంగళవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ హుజూరాబాద్‌లో పరామర్శించారు. ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ కౌశిక్‌రెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, కేడీసీసీ వైస్ చైర్మన్ పింగిళి రమేష్, తదితరులు ఉన్నారు.

విద్యార్థినులకు యూనిఫాం అందజేత


యూనిఫాం అందిస్తున్న ఎమ్మెల్యే

మానకొండూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో మంగళవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. శ్రీనివాస్‌నగర్ గ్రామంలోని కేజీబీవీ విద్యార్థినులకు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్కూల్ యూనిఫామ్స్ అందజేశారు. ఈకార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ స్వప్న, ఐసీడీఎస్ సీడీపీఓ సవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎవరికి న్యాయం జరిగిందని ఉత్సవాలు ?'


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కవ్వంపల్లి

శంకరపట్నం: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎవరికి న్యాయం జరిగిందని దశాబ్ది ఉత్సవాలు చేసుకుంటున్నారని డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని మెట్‌పల్లిలో మంగళవారం రెండోరోజు గడప గడపకూ కాంగ్రెస్‌లో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి నెలరోజులు గడుస్తున్నా డబ్బులు ఖాతాల్లో జమకాలేదని, రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ధరణి పోర్టల్‌ను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బస్వయ్య, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పోచయ్య, శ్రీనివాస్‌రెడ్డి, గట్టయ్య, శ్రీనివాస్, ఓదెలు, ఓంకార్, రవి, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్ దమయంతి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో సర్పంచ్ గూడూరు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం భూసార పరీక్షలపై కేవీకే కోఆర్డినేటర్ దమయంతి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూమి సారం తెలుసుకోవడానికి పరీక్షలు దోహదపడతాయన్నారు. పరీక్షల ద్వారా రసాయన ఎరువులు, సేంద్రియ ఎరువులు ఏ మోతాదులో వాడాలో తెలుసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో కేవీకే ఫీల్డ్ ఆఫీసర్ సోనీ, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పూర్తి చేయాలి


చర్చిస్తున్న ఆర్డీవో బెన్ షాలెమ్

చిగురుమామిడి: తహసీల్దార్ కార్యాలయాన్ని హుస్నాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో బెన్ షాలెమ్ మంగళవారం సందర్శించారు. కొత్త ఓటర్ల నమోదు తహసీల్దార్ ముబీన్ అహ్మద్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామాల్లో చనిపోయిన వారి పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించాలని సూచించారు. బీఎల్‌వోలు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను 23వ తేదీలోపు పూర్తి చేయాలని కోరారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కొత్త ఓటరు జాబితాను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కరపత్రం ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాజమల్లయ్య

గన్నేరువరం: యూత్ డిక్లరేషన్‌లో భాగంగా తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో 18న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహించనున్నామని పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ రాజమల్లయ్య తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి విద్యార్థులకు పోటీలపై మంగళవారం అవగాహన కల్పించారు. కరీంనగర్ జిల్లాతో పాటు మానకొండూర్ నియోజకవర్గంలో డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని, యువతి. యువకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సద్గురు కళాశాల కరస్పాండెంట్ కొంపెల్లి రవీందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్


గెలిచిన జట్టు సభ్యులతో ఎస్సై అంజయ్య

రామడుగు: క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని రామడుగు ఎస్సై టి.అంజయ్య తెలిపారు. మండలంలోని దేశరాజ్‌పల్లి శివారులో ఎండీ యాకుబ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఈసందర్భంగా మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీలు నిర్వహించడం హర్షణీయమని అన్నారు. టోర్నీలో విన్నర్‌గా గంగాధర, రన్నర్‌గా దేశరాజ్‌పల్లి జట్లు నిలవగా ఎస్సై కప్‌లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోల రమేష్, ఎంపీటీసీ వంచ మహేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్కపల్లి లచ్చయ్య, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు అంజనేయులుగౌడ్, టోర్నీ నిర్వాహకుడు ఎండీ రసూల్, తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ పదవి భర్తీ చేయాలి


మాట్లాడుతున్న పుష్పలత

హుజూరాబాద్: జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎందుకు భర్తీ చేయడం లేదో చెప్పాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు వేముల పుష్పలత ప్రశ్నించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. చైర్మన్ పదవి ఎస్సీ మహిళకు కేటాయించి ఏడాది గడిచినా ఇంతవరకు బీఆర్ఎస్ ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడాన్ని ఖండించారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికైనా పదవిని భర్తీ చేయాలని లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బాబు, హుజూరాబాద్ నియోజకవర్గం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సదానందం, జిల్లా ఉపాధ్యక్షురాలు సుశీల, మైనార్టీ టౌన్ అధ్యక్షుడు అప్సర్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాల్లో డబ్బులు జమచేయాలి


మాట్లాడుతున్న సారంగపాణి

ఇల్లందకుంట: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి రెండు నెలలు గడుస్తునా రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమకాలేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గూడెపు సారంగపాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడారు. డబ్బులు ఖాతాల్లో పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, అకాల వర్షాలతో పంటలు నష్టపోయినవారికి ఎకరాకు రూ. పదివేల ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించి ఇప్పటివరకు ఇవ్వకుండా ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. ధాన్యం, పంట నష్టపరిహారం రైతులకు అందించకుంటే పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శివకుమార్‌గౌడ్, తాడం దిలీప్‌కుమార్, తిరుపతి,వెంకటేష్ తదితరుల ఉపాల్గొన్నారు.

రూ.15,116 విరాళం

వీణవంక: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో జరుగనున్న చిడుతల రామాయణ పట్టాభిషేక కార్యక్రమానికి వీణవంక గ్రామానికి చెందిన ట్యూరిటో సీఈవో పాడి ఉదయానందన్‌రెడ్డి రూ.15,116 విరాళం ప్రకటించారు. ఈమేరకు అనుచరుల ద్వారా నగదు గ్రామస్తులకు అందజేశారు. సందర్భంగా ఉదయానందన్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాడి సౌజన్యతిరుపతిరెడ్డి, వెన్నంపల్లి నారాయణ, హమీద్, అమృత ప్రభాకర్, సమ్మిరెడ్డి, లోకేశ్, తాళ్లపల్లి కుమారస్వామి, శేఖర్, చిట్టి తోట్ల రాకేశ్ తదితరులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

శంకరపట్నం: మండలంలోని ధర్మారం గ్రామంలో మంగళవారం గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా హోమాలు నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు. మండలంలోని కొత్తగట్టులో పెద్దమ్మజాతర సందర్భంగా ముదిరాజ్ కులస్తులు బోనాలు సమర్పించారు.